# తోటలో డాబా*

[కథానిక]

## = శ్రీ అజ్జరపు వెంకటరమణరావు =

ఏడెనిమిది యేళ్ల క్రితం. ఆరోగ్యం బాగుపడా లని నే నావూరు వెళ్లాను. ఆ వూరికి మధ్య పొలాలలో ధనవంతు లందరికీ యిళ్లు వున్నాయి. చాలామంది శెలవులకి అక్కడికి వస్తుండేవారు. నేను వున్న యిల్లు చాలా పెద్దది. ఎంతో విశాలంగా వుండేది. ఒక పెద్ద సావడి. దానిలో నాలుగుపక్కల స్తంభాలు. మధ్య వెలుతురు వచ్చేలాగ ఒక మండువా. నే నేమీ తోచక అలాగే అక్కడ తివాసీమీద పడుకొని ఆలోచిస్తోండే వాణ్ణి. లేకపోతే ఆ పెద్దపెద్ద కిటికీలలోంచి చుట్టూ వున్న పొలాలనీ, తోటలనీ, దూరంలో క్రిందకు వంగుతోన్న ఆకాశాన్నీ అలా చూస్తో కూర్చునే వాణ్ణి. ఆ యింటి యజమానికొడుకు సుందరంకూడా నాతో పాటే అక్కడ వుండేవాడు. అతను పొద్దున్నే లేచేవాడు. స్నానం చేసేవాడు. పట్నంలో వున్నప్పటిలాగే సూటు తగిలించి వూరంతా తిరిగి వచ్చేవాడు. ఇంట్లో కాఫీ తాగేవాడు. అస్తమానూ ఏదో చిరుతిండి తింటూవుండేవాడు. ఇవన్నీగాక తన కేమీ తోచడం లేదని నన్ను బాధిస్తోండేవాడు. అతనితో, అతని భావాలతో ఏకీభవించి, ఆఖరికి అభిమానం చూపించి మాట్లాడే మనిషి అయినా అక్కడ లేడే అని అతనికి విచారం. నేనుమటుకు—నాకు పనేమి వుంది? ఆ సావిడిలో అలాగే పడుకొనివుండేవాణ్ణి. పెద్దగా వర్షం వస్తే, యిల్లంతా కూలిపోతూన్నట్లు చప్పుడయ్యేది. గాలిహోరుకి కిటికీల తలుపులు అదే పనిగా అటూ యిటూ కొట్టుకొని చప్పుడు చేసేవి. ఒక్కొక్కసారి ఆ ఉరుములవెనుక అన్ని కిటికీలలో నుంచీ మెరుపులు ఆ చీకటిలోనుంచి తళుక్కున మెరిస్తే, నా గుండెలు ఝల్లుమనేవి. నా కెంతో భయంగా వుండేది.

ఒకనాడు సాయంత్రం నేను యింటికి తిరిగి వస్తుంటే ఒక పెద్ద ప్రహరీగోడ, లోపల ఏదో పెద్ద యిల్లు వున్నట్లు కనిపించాయి. సూర్యు డప్పుడే అస్తమిస్తున్నాడు. పొడుగాటి నీడలు పండిన వరిపొలాల మీద పాకుతున్నాయి. గేటుదగ్గరనుంచి లోపలికి ఏపుగా పెరిగిన మొక్కలు బారులుతీసి నాటబడి వున్నాయి. నేను ఒక పక్కనుంచి వెళ్లిచూద్దామని వాటి వెనకాలనుంచి నడుస్తుంటే, కాళ్లల్లో ముళ్లు గుచ్చుకుంటున్నాయి. చీకటిపడుతోంది. చెట్ల ఆకులలో అల్లుకొన్న సాలిగూడులు వర్షపు జల్లులలో నుంచి కనిపించే సూర్యరశ్మిలోని ఇంద్రధనుస్సు రంగుల్లో మెరుపుల్లా అక్కడక్కడ తళుక్కున మెరుస్తున్నాయి; బంగారపు నగిషీతో అల్లిన చిన్న చిన్న అలంకారాలలాగ. కొబ్బరిచెట్లలోనుంచి నీరుకారుతోంది. ఏదో విసుగ్గా, ఘాటుగా వాసన వేస్తోంది. నేను కుడివైపు నిమ్మచెట్లకేసి మళ్లాను. నా కాళ్లక్రింద ఎండి రాలిపోయిన ఆకులు నలిగి నశించిపోయాయి. ఎడమవైపు ఏదో చెట్టుకొమ్మలలోనుంచి ఒక పక్షి ఓపికలేని కంఠంతో, నీరసంగా ఏదో పాడుతోంది. అది బాగా ముసలిపక్షికాబోలు అని అనుకున్నాను. ఇంతట్లోకే ఆ నిమ్మచెట్లవరుస ఆఖరు అయిపోయింది. ఏవో పూలతీగలు మీదికి పాకుతోన్న తెల్లని పెద్ద

---

* **Anthony chekov** కు క్షమార్పణలతో.

డాబాముందర భాగానికి నేను వచ్చాను. ముందర నీటిని జల్లుతోన్న యంత్రంతో చక్కని బొమ్మ వుంది. దాని చుట్టూ పెద్ద తిన్నె. దాంట్లోనుంచి పొడుగాటి స్తంభం. దానికి తెల్లటిరంగు. అస్తమించిన సూర్యుడి కిరణాలలోని పసిమినీడలు ఆ డాబామీద పాకే తీగలమీదా, ఆ ముందటి స్తంభంమీదా పడుతున్నాయి. పవలు పోతూ, రాత్రి రాబోతూన్న ఆ సంధ్యాసందిగ్ధంలో యీ సన్నని సూర్యకిరణాల బంగారుపసిమిరేఖలు ఎంతో అందంగా లోకంమీద పాకుతున్నాయి. నాకాప్రదేశం అంటే ఎన్నిదినాల నుంచో ఎంతో బాగా పరిచయంవున్నట్టు అనిపించింది. అక్కడ అలా నిలుచుని వుండిపోతే ఎంత బావుంటుంది అనుకున్నాను.

ఇంతట్లోకే సింహాలు చెక్కిన ఆ తెల్లని రాతి స్తంభపుగేటుదగ్గర ఇద్దరు అమ్మాయిలు కనిపించారు. పెద్దపిల్ల సన్నగా, ఎర్రగా, పొడుగ్గా వుంది. ఆమె చక్కదనంలో ఒక ఆకర్షణ, దాని వెనకాలే గర్వం కలిసివున్నట్లు కనిపిస్తోంది. ఆమె నన్ను చూచీ చూడనట్లునటించింది. రెండవపిల్ల అంతకంటే చిన్నది. ఆమె కూడా సన్నగా, పచ్చగా, పొడుగుగానే వుంది. ఆమె పెద్దకళ్లు ఎంతో అందంగా వున్నాయి. ఆమె ఎర్రని మెత్తని పెదవులు ఎంతో చక్కగా కనిపిస్తున్నాయి. ఆమెకు బహుశా పదునేడు, లేక పదునెనిమిది ఏండ్లు వుంటాయి. ఆమె అమాయికంగా, కుర్రతనంగా కనిపించింది. నాకేసి, నేను బాగా కనిపెట్టేటంత బాగా పరకాయించి చూచింది. నాకళ్లు ఆమెకళ్లతో కలిపేసరికి కొంచెం కంగారుపడింది. నన్నుగురించి అప్పగారితో ఏదో చెప్పింది. మళ్లీ నాకేసి చూసింది. నాకు వాళ్లని చాలాకాలంనుంచి ఎరిగున్నట్లే అనిపించింది. ఏదో చాలా సరదాగా వున్న కలలోనుంచి చటుక్కున మెలకువ వచ్చినట్లు తోచింది.

ఒకసారి నేనూ, సుందరం మాయింటిముందు పచారుచేస్తుంటే గుర్రపుబగ్గీ ఒకటి మాగేటులోనుంచి లోపలికి రావడం జరిగింది. అందులోనుంచి నేనిది వరకు చూచిన యిద్దరిలోనూ పెద్దపిల్ల దిగివచ్చింది. ఆ క్రితందినం పల్లెగూడెంలో అంటుకున్న యిళ్ల నష్టానికి పరిహారంగా చందా వసూలుచేయడానికి ఆమె వచ్చింది. ఎన్నియిళ్లు పోయినాయో, ఎంతమంది మగవాళ్లు, ఆడవాళ్లు, పిల్లలూ బాధపడుతున్నారో, వాళ్లందరికీ తాను పనిచేస్తున్న కమిటీ ఏమేమి ఏర్పాటులుచేసిందో, యివన్నీ మామొహంకేసి అయినా చూడకుండా గబగబా చెప్పేసింది. మా చేతికి చందా పుస్తకం యిచ్చింది. మా పేర్లు రాయగానే, అది తీసికొని మళ్లీ బండిలో పెట్టేసింది. వెళ్లి పోతూ, "నువ్వు మమ్మల్ని పూర్తిగామరిచిపోయావు సుందరం! ఎప్పుడయినా వీలయినప్పుడు మాయింటికి ఒకసారి రా! నీతోపాటు మీ స్నేహితులు కూడా రాగలిగితే చాలాసంతోషం. వారి చిత్రాలు చూచి అభినందించే మాలాంటి మిత్రుల ఆహ్వానాన్ని అంగీకరించడానికి వారికి అభ్యంతరం లేకపోతేను." అంది.

నేను నమస్కారం చేశాను. ఆమె వెళ్లిపోయింది. "నీకు యీ అమ్మాయి ఎవరో తెలుసా" అన్నాడు సుందరం. "ఊహు" అన్నాను.

"ఈ పిల్ల పేరు శాంత. వీళ్లది అసలు యీవూరే. వీళ్ల తండ్రి శేషగిరిరావుగారు హైకోర్టులో ప్రాక్టిస్ చేస్తుండేవారు. ఆయన పోయినప్పటినుంచి యీ అమ్మాయి, తల్లి, చెల్లెలూ అంతా యిక్కడే కొన్నాళ్లనుంచి వుంటున్నారు. వీళ్ల తోటయిల్లు 'ఉదయప్రభాస'. అది మనం సాయంత్రం షికారు పోయే దారికేసి వుంది. ఈ అమ్మాయి బి. ఏ. పాసయింది. ఈ వూళ్లోనే స్కూలులో పనిచేస్తోంది. పాతికరూపాయలు జీతం. ఆమెకోసం అయ్యే ఖర్చు ఆమెసంపాదనలోనే యిమిడి వుండాలని ఆమె ఆశయం. సంఘసేవ చేయడం అంటే ఆమెకు అభిమానం. వాళ్లది మంచి సరదా అయిన కుటుంబం. నువ్వు కూడా వస్తే వాళ్లు చాలా సంతోషిస్తారు. మనం యిద్దరం ఎప్పుడయినా వెడదాం" అన్నాడు.

ఒక ఆదివారం మధ్యాహ్నం నేనూ, సుందరం 'ఉదయప్రభాస'కి వెళ్లాం. వాళ్లు అంతా యింట్లోనే

వున్నారు. వాళ్ల తల్లి రాజ్యలక్ష్మమ్మగారు యిదివరకు చాలా అందమయిన మనిషిగా వుండినట్లు కనిపిస్తుంది. ఇప్పుడు తన వయసుకుమించిన దేహం పెరిగిపోయింది. మనిషి లావుగా, బద్ధకంగా, మందమతిగా కనిపిస్తోంది. నే గీసిన బొమ్మలనిగురించి మాట్లాడడం మొదలుపెట్టింది. శాంత నే వస్తానని చెప్పగానే, ఆవిడ పట్నంలోనూ అక్కడా ఎగ్జిబిషన్సులో చూచిన చిత్రాలని జ్ఞాపకం తెచ్చుకొని, వాటిమీద నా అభిప్రాయాలు ఏమిటో ప్రశ్నించాలని ప్రారంభించింది. శాంత నా కేసి చూచీచూడనట్లు కూర్చుంది. సుందరంతోటే మాట్లాడుతోంది. వాళ్ల కమిటీ సంఘసౌకర్యానికి చేస్తూవున్న పనులు, దాంట్లో తనయొక్క భాగం చెబుతూ "నువ్వు ఒక్కసారి అయినా మా మీటింగులకి ఎందుకు రాలేదు" అని అడుగుతోంది. "ఇది నీకు న్యాయంకాదు సుందరం! చాలా అన్యాయం. నువ్వు సిగ్గుపడవలసిన విషయం" అంటోంది అతన్ని తీవ్రంగా చూస్తో.

"నిజమే శాంతా! నిజమే" అంది రాజ్యలక్ష్మమ్మగారు. "ఇప్పుడు యీ వూరికి అధికారం అంతా వేంకటరెడ్డి చేతుల్లో వుంది. మన స్కూలులో, పంచాయితీలో, యితర గొడవల్లో యింకెవరికీ జోక్యం లేకుండా, తన అల్లుళ్లనీ, బావమరదులనీ దూరుస్తాడు. ఇది మనం అంతా తీవ్రంగా ప్రతిఘటించవలసిన విషయం. దీనికి యువకులు అంతా సిద్ధపడాలి. ముందుకు ఉరకాలి! కార్యరంగంలోకి దుమికి అహోరాత్రాలూ పనిచేయాలి" అంటోంది. "నీలాటి యువకులు యిళ్లల్లోనుంచి కదలకపోవడం ఎంత అవమానకరమయిన విషయం? ఆలోచించు ఒక్కసారి సుందరం!" అంది మళ్లాను.

ఈ సంఘసేవదీక్షనిగురించి జరిగే వాగ్ధోరణికి అడ్డురాకుండా లీల అలాగే కూర్చుంది. ఆమెకు యింత పెద్ద పెద్దవిషయాలనిగురించి ఆలోచించే వయస్సు లేదని అభిప్రాయం ఆ యింట్లో. అలాంటివి ఆమెకు అనవసరం అని వాళ్ల వుద్దేశ్యం. ఆమెను పసిపాపలా చూస్తారు వాళ్లు. చిన్నప్పుడు ఆమెను 'బేబీ' అని పిలిచే అలవాటు యిప్పటికీ అలాగే నిలిచిపోయింది. ఆమె నాకేసి చిత్రంగా చూస్తోంది. నాతో మాట్లాడడానికి కుతూహలంగా వున్నట్లు కనిపించింది. ఆమె ఒడిలో ఒక ఫోటో ఆల్బమ్ పెట్టుకొని కూర్చొనివుంది. నేను ఆ ఆల్బమ్‌కేసి చూసేసరికి నా దగ్గరగా జరిగింది. అది తీసి తన వేళ్లతో "ఇది మా నాన్న ఫోటో; ఇది మా బామ్మది; ఇది మా అక్కయ్య" అని చెబుతూంటే ఆమెనున్నని, గుండ్రటి, మెత్తటి భుజాలు నా ఒంటికి సుఖంగా తాకుతున్న మృదుస్పర్శలో నేను పులకించాను. ఆమెఅమాయికత నా కెంతో సుఖంగా, స్వప్నవీథిలా వుంది. నేను ఆమె తెల్లని, చక్కని చేతులు, ఆమె సన్నని పమిటలో, లేత గులాబీబ్లౌజులో పెరుగుతూ, దాగుడుమూతలాడే పొంగుతోన్న వయసుపొంగులు, లేతకంఠం, సన్నని నడుము- ఒకటొకటే పరిశీలిస్తూ నన్ను నేనే మరిచిపోతూన్నాను.

ఆమె రివ్వున లేచి కారమ్‌బోర్డు పట్టుకొచ్చింది. మే మిద్దరం కాస్సేపు ఆడుకొన్నాం. మమ్మల్ని టిఫినుకు హాలులోనికి రమ్మన్నారని నౌకరీ కుర్రాడు వచ్చి చెప్పాడు. మేము వెళ్లాం. అక్కడ శాంత, రాజ్యలక్ష్మమ్మగారు, సుందరం కూర్చున్నారు. మే మంతా కలిసి టిఫిను తీసికొంటున్నాం. శాంత ఆవూరి వేంకటరెడ్డినిగురించి, పల్లెవాళ్లసౌఖ్యాన్ని గురించి, సదుపాయాలనుగురించి, ఊళ్లో పెట్టవలసిన లైబ్రరీనిగురించీ మాట్లాడుతోంది సుందరంతో. ఆమె గట్టిగా మాట్లాడినా, బాగానే మాట్లాడుతుంది. ఆమెకు ఆ విషయా లంటే అపరిమితమయిన యిష్టం వుంది. ఇక సుందరానికి, ఏ విషయం అయినా తెగూ తెంపూ లేకుండా రోజులకొద్దీ అలాగే మాట్లాడడం అలవాటు. అది కాలేజీలో చదువుకుంటున్న రోజుల నుంచీ వుం దతనికి. ఈ వేళ పోతుందా! ఆ కంగారులో తెల్లని టేబిలుగుడ్డమీద ప్లేటులో వేసిన చట్నీ సుందరం వలకబోశాడు. దానిపైకి తన ప్లేటు లాగి తినడం ప్రారంభించాడు. శాంత చూచీ చూడనట్లు ఊరుకొంది.

మేము యింటికేసి బయలుదేరాం. అప్పటి కప్పుడే చీకటిపడుతోంది. "పెద్దకుటుంబాలు, చదువుకున్న పిల్లలు అంటే అలా వుంటుంది. తను అంతసేపు నాకంటె బాగా మాట్లాడినా, ఏ ప్లేటూ వలకబోసి గుడ్డ పాడుచెయ్యకపోవడమే కాకుండా, నే నలా చేసినా తను ఎరుగనట్లు వూరుకొంది. నాకు అలాంటి వాళ్లు అంటే ఎంతో యిష్టం! వాళ్ల కుటుంబం చాలా గౌరవమయింది. నాకు ఎప్పుడూ అలాంటి కంపెనీలో వుండాలని వుంటుంది. కాని నాకు ఎన్ని యితర వ్యవహారాలు! తీరిక ఎక్కడ?" అంటూ వస్తున్నాడు సుందరం.

'వీడు శుద్ధచవట దద్దమ్మ' అని నేను లోపల అనుకున్నాను. వీడికి టైములేదూ? పనిలో మునిగి తేలి ఛస్తున్నాడా! జేబులో వున్న వుత్తరాలు మూడువారాలయినా పోస్టు బాక్సులో వడేయడే!

"నాకు తీరుబడి ఎక్కడ! అయినా నేచేసే పనికి గౌరవం వుంది. అభినందించే ప్రజ వున్నారు. పాపం, నీ మాట ఆలోచించు. నువ్వలా చిత్రాలు గీస్తూనేవుంటావు. ఎవరు చూచి ఆనందించను! నిన్ను అభినందించేవాళ్లు ఎవరున్నారు?" అంటూ నా పక్కనే నడుస్తూవచ్చాడు. ఎవరు అడిగారని యీ అభిప్రాయం!

౨

నే నప్పటినుంచి 'ఉదయప్రభాస'కి తరుచు వెడుతూండేవాణ్ణి. వెళ్లినపుడల్లా వరండాచీడీలమీద కూర్చునేవాణ్ణి. నా కేదో అసంతృప్తి. ఏదో ఆవేదన. నా జీవితం అంతా వ్యర్థంగా గడిచిపోతున్నట్లు భయం. నాలోనుంచి నాగుండెలని పీకుకొని పైకి పారవేయాలన్నంత కోపం. పైన డాబామీద మనుష్యుల మాటలు, చీరల గరగర, పేజీలు తిప్పిన చప్పుడు! నాకు శాంతతో షికారులు, జబ్బుచేసిన వాళ్లకి పరిచర్య, యియ్యవలసిన పుస్తకాల సంగతి చెబుతూంటే వినడం అలవాటయింది. ఒక్కొకసారి వర్షం వస్తే, ఆమెగొడుగులోనే వాళ్ల యింటికి తీసి కొనివెళ్లేది. ఆమెకు అంత దగ్గరగా నడుస్తుంటే ఆమె ఎర్రని పెదవులు, నాకు తగిలే మెత్తటి భుజాలు, ఆమె అందమయిన మొహం నన్ను కంగారుపెట్టి బాధించేవి. ఆమె ఏదో విషయాన్ని గురించి చెప్ప బోతూ, "ఇది మీకు యిష్టంవుండదు. క్షమించండి" అని ఆగిపోయేది. నేను ఆమెఆశయాలకి అంతగా అభిమానం చూపించడం లేదని ఆమెకి లోపల నామీద కోపం. అదీగాక నేను చిత్రకారుణ్ణి. కేవలం నదులను, ఆకాశాన్ని, సూర్యాస్తమయాలను, సూర్యోదయాలనూ గురించి నే గీసే బొమ్మలు ఆ అమ్మాయికి ఎలా నచ్చుతాయి? వాటిలో ఆకలితో కృశించి నశించి పోయే మనుష్యులు వుండరు. జబ్బుచేసి మందుకోసం డబ్బులేక ఏడ్చే రోగులు కనిపించరు. పుస్తకాలకోసం దేవుళ్లాడే వ్యక్తులు అందులో వుండరు. ఇవి అన్నీ ఆమెకు యిష్టం. ఇవి నాబొమ్మల్లో ఎక్కడా వుండవు. అందుచేతనే ఆమెఆశయాలంటే నాకు గౌరవం లేదని ఆమె నమ్మకం.

బేబీకి యిలాంటి బాధ లేవీ లేవు. నాలాగే ఆమె సుఖంగా కాలం గడపగలదు. పొద్దున్నే లేవ గానే ఏదో పుస్తకం పట్టుకొంటుంది. ఆ పుస్తకం పుచ్చుకొని డాబామీదికి వెళ్లి అక్కడ కుర్చీలో కాళ్లు కిందకి ఆనకుండా కూర్చొని చదవడం మొదలు పెడుతుంది. లేకపోతే ఆ పుస్తకంతో నిమ్మచెట్లకేసి పోయి కూర్చొంటుంది. లేకపోతే గేటుదగ్గరనించి లోపలిదాకా చదువుతూ తిరుగుతూ వుంటుంది. చాలా ఓపికతో పొద్దున్ననుంచి సాయంత్రందాకా అలా చదువుతూనే వుంటుంది. నన్ను చూడగానే కొంచెం సిగ్గుపడుతుంది. ఆ పుస్తకం ఎక్కడో పెట్టేసి నాదగ్గరగా వచ్చి తన పెద్దకళ్లతో నాకేసి ఆశ్చర్యంగా చూస్తో కూర్చొంటుంది. కొంతసేపు అయినాక, యీవేళ మా నౌకరు చెట్టుఆకులు కోస్తూ కాలుజారి క్రిందపడినాడనో, లేక బీచిలో నిన్న పల్లెవాళ్లకి చాలా పెద్దచేపలు దొరికాయనో చెబుతూంటుంది. ఆమే, నేనూ లేచి జామచెట్లకేసి పోయే వాళ్లం. ఆమె చక్కని చేతులని పైకి ఎత్తి జారిపోయే

పమిటకోసం కంగారుపడుతూ పళ్లుకోస్తుంటే, నేను ఆమెను చూస్తూ అలా నిలబడేవాణ్ణి. ఆమె పళ్లన్నీ పోగుచేసి నాదగ్గరికి తెచ్చేసరికి, నేను ఆమె స్కెచ్ గీస్తుంటే ఆమె వూపిరి పీల్చకుండా, నిశ్శబ్దంగా నావెనకాల నుంచుని అలా చూస్తూండేది. నేను వెనక్కి తిరిగేసరికి పకాలున నవ్వేది. ఆ బొమ్మలు ఆమె కిచ్చేవాణ్ణి.

నాకు పనీ పాటా ఏముంది? ఒకసారి పొద్దున్నే వాళ్ల యింటికివెళ్లాను. నౌకరు "అమ్మగారూ, అమ్మాయిలూ అంతా డాబామీద వున్నారు. కాఫీ తాగేదాకా అక్కడే వుంటా"రని చెప్పాడు. నేనూ పైకి వెడదామని అనుకుంటున్నాను. నాకలాంటి సమయాలలో సరదాగా గడపడం అంటే ఎంతో యిష్టం. చుట్టూ అందంగా పూలతోట. మంచు బిందువులు ఆకులమీదనుంచి సూర్యకిరణాలకు కరగి కిందకి రాలి చిరుచప్పుడు చేస్తున్నాయి. లేతఎండ లోని వేడిమి శరీరానికి నులువెచ్చగా తాకుతోంది. డాబామీద తీగలలోనుంచి కమ్మని జాజివాసన మత్తుగా వీస్తోంది. పైన మాటలు వినిపిస్తున్నాయి. వాళ్లు రోజు అంతా అలాగే కబుర్లు చెబుతూ, ఏమీ పనిలేకుండా కాలక్షేపం చేసేయగలరు. వాళ్లకి యింకేమీ పనిలేదు. నాకూ లేదు. అలాంటప్పుడు అలాంటివాళ్లతో కలిసి సుఖంగా కాలంగడుపుతూ బతుకున్నాళ్లూ అలా వుండిపోతే బాగుంటుందని అనిపించదూ! నేను తోటలో అటూ యిటూ పచారు చేస్తున్నాను. ఒక పూలసజ్జ పట్టుకొని లీల పరుగెత్తి కొనివచ్చింది. నన్ను చూసింది. నవ్వింది. నేను దగ్గరగా వెళ్లాను. "పువ్వులు కోసుకొందాం వస్తారా మరి" అంది. మే మిద్దరం కావలసినన్ని పూవులు కోశాం. సజ్జ పట్టలేదు. "లీలా, నీ కొంగు పట్టు. నే కోసి అందులో వేస్తా"నన్నాను. ఆమె నా కతిదగ్గరగా తిరుగుతోంది. క్షణక్షణం ఆమె లేతబుజాల మెత్తదనం నా వంటికి ఏదో అపూర్వమయిన సుఖం కలిగిస్తోంది. ఆమె నన్ను ఏవో ప్రశ్నలు వేస్తోంది. నేను మాట్లాడుతోంటే నా ముందర నిలుచుని, నాకేసి తన నిగనిగలాడే కళ్లతో వింతగా చూసేది.

"నిన్న మా వూళ్లో ఒక తమాషా జరిగింది. ఎన్నాళ్లనుంచో జబ్బుతగ్గని ముసలమ్మకి ఎవరో ఒకడు మంత్రం వేస్తే చటుక్కున తగ్గిపోయిందట. ఎంత విచిత్రంగా వుందో చూశారా!" అంది.

"దాంట్లో బ్రహ్మాండం ఏముంది! నువ్వు విచిత్రమయిన విషయాలు చూడడానికి రోగిష్ఠి వాళ్లదగ్గరకి ఎందుకు వెడతావు? మనం అంతా ఆరోగ్యంగా వుండడం ఒక విచిత్రం కాదూ! మన జీవితం ఎంత విచిత్రమయింది! విచిత్రం అంటే మనకు అర్థంకాని విషయం అని ఎందుకు అనుకోవడం?"

"అయితే మరి మన కర్థంకాని విషయాలని గురించి మీరు భయపడరా?"

"ఊహు! నేను నా కర్థంకాని విషయాలని ఎదుర్కొని చూడాలని అనుకుంటాను. నేను వాటి కంటె గొప్పవాడిని. మనిషి సింహాలకంటె, పులుల కంటె, నక్షత్రాలకంటె గొప్పవాడు. సృష్టిలో ప్రతి యితరవిషయానికీ అతడు అతీతుడు. నువ్వు అనుకునే విచిత్రమయిన విషయాలకంటె అతనే గొప్పవాడు. లేకపోతే చుంచులో చప్పుడయితే భయపడే ప్రతివాడూ మనిషి ఎలా అవగలడు?"

లీల నేను చిత్రకారుణ్ణి అవడమేకాకుండా యింకా యితరసంగతులు ఎన్నో తెలిసినవాణ్ణి అని అనుకొంది. నాకు సృష్టిలోని సౌందర్యం, ఆనందం, సత్యం, అమరత్వం అన్నీ తెలుసుననీ, తనకీ ఎలాగయినా అర్థం అయ్యేలాగ చేయమనీ నన్ను అడిగేది. నే నొక్కణ్ణే యిటువంటి సంగతులనిగురించి మాట్లాడగలిగినవాణ్ణని ఆమెకు నమ్మకం. నేను 'అది నిజమే' అన్నట్లుగా "మానవులకి అమరత్వం సహజలక్షణం. మనం ఎన్నడూ నశించని ఒక దివ్యజ్యోతిలోని అణువులం" అని చెబుతూండేవాణ్ణి. ఆమె నే చెప్పినవన్నీ వేదవాక్యాలుగా నమ్మేది. అవి నిజమేనా అన్న సందేహం ఎప్పుడూ ఆమెకు రాదు. మీరు చెప్పే విషయాలకి తార్కాణాలు వున్నాయా అని ఏ నాడయినా అడుగుతుందేమో అన్న భయం నాకూ లేదు.

మేము యింటి గుమ్మందాకా వచ్చాం. లీల చటుక్కున ఆగి "మా శాంత చాలా అద్భుతమయిన మనిషి. అది అంటే నాకు చాలా గౌరవం. దాని కోసం నా జీవితాన్నయినా అర్పించేస్తాను. కాని..." ఇంకా నా దగ్గరగా వచ్చి, నా షర్టుకఫ్స్ సర్దుతూ "నాతో చెప్పరూ! మా శాంతా, మీరూ ఎప్పుడూ అలా వాదించుకొంటూవుంటారేం? అది మాట్లాడుతూంటే మీరు చాలా చిరాకుపడుతున్నట్లు కనిపిస్తారు, అవునా!" అని అడిగింది.

"అవును. ఆమె మాట్లాడేదాంట్లో నాకేమీ అర్థం కనిపించదు మరి" అన్నాను నేను.

లీలకళ్లల్లో నీళ్లు గిర్రున తిరిగాయి. 'ఇది నాకేమీ అర్థంకావడం లేదు' అనుకుంది.

ఇంతట్లోకే శాంత తొందరతొందరగా అటు వచ్చింది. తోటకేసి వెళ్లింది. పాలికాపుని పిలిచింది. ఏవో పనులు చేయాలని చెప్పింది. లోపలికి వెళ్లింది. డ్రాయర్లు అన్నీ తెరిచింది. ఎందుకో గబగబా సర్దింది. మళ్లా తీసింది. దేనికోసమో కొంతసేపు వెదికింది. మళ్లా వేసేసింది. చాలా పనితొందరలో వున్నట్లు హడావిడిగా తిరుగుతోంది. మేమంతా లోపల టిఫిను తీసికొంటున్నాం. కాఫీ తీసికొనే టైముదాకా తను రానేలేదు. ముఖ్యంగా గమనించదగ్గ సంగతు లేవీ జరగకపోయినా, యిలాంటివన్నీ పరిశీలిస్తుండడం నాకో అలవాటు. లీల మళ్లా యింకో పుస్తకం చదువుతూంది. నేను చీడీలమీద పైన విశాలమైన నీలి ఆకాశంలో పరుగులెత్తే మబ్బులని చూస్తూ కూర్చున్నాను.

రాజ్యలక్ష్మమ్మగారు విసురుకుంటూ, ఒక విసనకర్రతో మే మిద్దరం కూర్చున్నచోటికి వచ్చి, ఆవులిస్తూ, బద్ధకంగా, నిద్రమొహంతో నిలబడింది.

"అమ్మా! పగలు నిద్రపోకూడదు. పడుకోకే!" అంది లీల.

లీలకు, తల్లికి పరస్పరం ఎక్కువ అనురాగం. లీల తోటలో తిరుగుతూవుండడం చూస్తూనే, "బేబీ, ఎక్కడున్నావ్" అని ఆవిడ కేకలేస్తోంటుంది. తల్లిని డాబామీద ఎదురుగుండా చూస్తూనే "అమ్మా, ఎక్కడా!" అంటూ కేకలు వేస్తోంటుంది లీలకూడా.

లీలలాగే ఆమెకూ నేనంటే అపరిమితమయిన గౌరవం. నేను నాలుగురోజులు వాళ్లయింటికి వెళ్లకపోతే, నాకోసం కబురంపించేది. "ఎందుచేత రాలేదు? వంట్లో బాగుంటోందికదా" అని అడుగుతూండేది. "మీరు బొమ్మలు ఎంతబాగా గీస్తారండీ" అంటూ మెచ్చుకుంటూండేది.

ఆవిడకీ శాంత అంటే చాలా గౌరవం. మాటిమాటికీ "మా శాంత చాలా అద్భుతమయిన మనిషి" అంటూవుంటుంది. "ఈ పుస్తకాలు, మీటింగులు, సంఘసేవ అన్నీ బాగానేవున్నాయి. కాని, పెళ్లియీడుపిల్ల యిక పెళ్లిచేసికొని స్థిరపడాలి మరి" అనేది ఆవిడ నవ్వుతూ.

"ఇప్పుడు ఎందుకూ ఆ గొడవ పోనిద్దూ" అని లీల మళ్లా తన పుస్తకం చదువుతూ కూర్చునేది.

నే నింటికి వెళ్లాను. ఇంటిదగ్గర సుందరం మొహం! ఆకాశం అంతా విరిగి మీదపడినట్లు కూర్చున్నాడు. ఏదో మాట్లాడతాడు. ప్రపంచకానికి ఏమీ విముక్తి లేదన్న ధోరణి. కొన్ని వేల మైళ్లకొలదీ నిర్మానుష్యమయిన సహారా ఎడారి అయినా సుందరం మొహంకంటె ఎక్కువ విసుగూ, నిరాశా కన్పించలేదనే నా వుద్దేశ్యం. తను ఏదో చెబుతాడు. ఏమంటావు అని అడుగుతాడు. అతని సిద్ధాంతాలమీద ఒక అభిప్రాయంకూడా ఏమిటి నాతలకాయ అని అనుకున్నాను.

"నూటికి తొంభైతొమ్మిదిమంది బుద్ధిలేని చచ్చుపీనుగులు అని అనుకుంటాను నేను" అన్నాను అతివిసుగుగా.

ఇది నేను అతన్ని గురించే అన్నట్లుగా అనుకొని చాలా చిన్నబుచ్చుకొన్నాడు.

## 3

నేను ఒకసారి రాజ్యలక్ష్మమ్మగారితో మాట్లాడుతూ కూర్చున్నపుడు శాంత గబగబా అక్కడికి వచ్చింది. "ఈ వేళ పిచుకలజమీందారు యిక్కడికి వచ్చారు. ఈ వూళ్లో హాస్పిటలుసంగతి ఆయనతో మాట్లాడాను. ఆయనకూడా ఆలోచిస్తానన్నారు. కాని ఆయనమీద నాకు అంతగా ఆశ లేదు" అని చెబుతూ నాకేసి చూచి "క్షమించండి. మీకిలాంటి విషయాలలో ఆదరంలేదన్న సంగతి నేను మరచిపోతూంటాను" అంది.

నాకు కొంచెం చిరాకుగానే వుంది యీ పరిస్థితి. "ఎందుచేత? నేనెలా అనుకుంటేమాత్రం మీకు మునిగిపోయింది ఏముంది? నేనేమని అనుకున్నా మీరు లెక్కచేయరుగా" అన్నాను.

ఆమె నాకేసి ప్రశ్నార్థకంగా చూసింది. "ఈ వూళ్లో ఆసుపత్రికి ఏమీ అవసరంలేదనే నావుద్దేశ్యం" అన్నాను నేను.

ఆమెకు ఒళ్లు మండిపోయింది. నాకేసి యీసడించిచూస్తూ "మరేం కావాలి? బొమ్మలు గీసిన పటాలు కావాలా?" అంది.

"అవీ అక్కర్లేదు. ఏమీ అక్కర్లేదు."

ఇంక ఆమె నాతో ఏమీ మాట్లాడలేదు. ఏమీ మాట్లాడలేకపోయింది కోపంతో. అక్కడ వున్న పేపరుతీసి చదవడం మొదలుపెట్టింది. ఒక నిముషం ఆగి, "పాపం, వెంటి నీళ్లాడలేక బాధపడి చచ్చిపోయిందట. ఇక్కడ ఒక హాస్పిటలయినా వుంటే బతికేదేమో! అయినా చిత్రకారులు యిలాంటి వుపద్రవపు విషయాలనుగురించి అయినా అనవసర మయినవిగానే అనుకోవచ్చు." అంటోంది.

"నేను నా వుద్దేశ్యం చెబుతాను వినండి. నాకు యీ హాస్పిటళ్లవల్ల, లైబ్రరీలవల్ల, స్కూళ్లవల్ల ఏమీ వుపయోగం వున్నట్లు కనిపించదు. ఇవన్నీ మన పరిస్థితులని యింకా అధమంగా చేయడమేగాని బాగు చేస్తాయని నేను అనుకోను."

ఆమె నాకేసి చూచి వెగటుగా నవ్వింది. నేను లెఖ్ఖచేయకుండానే యిలా మొదలుపెట్టాను: "ఒక వెంకమ్మో, వెంటమ్మో పురిటింట్లో నెప్పులుపడలేక యిబ్బందిపడి చనిపోయిందంటే విచారించవలసిన పని లేదు. ఇలాంటివాళ్లు కోట్లకొలది ప్రజ సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం దాకా పనిచేసి చేసి, ఆయాసంతో అలసిపోయి, విశ్రాంతి లేక, తినడానికి తగిన తిండిలేక, మలమలమాడే పిల్లల దుస్థితి చూడలేక, యీ ఆవేదనలతో, ఆదుర్దాలతో యౌవనంలో సుఖాన్ని ఎరుగక, పడుచుతనంలోనే వృద్ధాప్యంలోని వ్యసనంతో క్రుంగిక్రుంగి నశించే దరిద్రపరిస్థితులు ఎంత ఘోరంగా వున్నాయి. కోట్లకొలది ప్రజల జీవితాలు పశువులజీవితాలకంటె ఎన్నోరెట్లు అధమంగా వున్నాయే! ఒక్కపూటయినా పూర్తిగా తాగడానికి గంజిమెతుకులు లేక ఆకలితో అలమటించిపోయి హరించిపోతున్నారు. దరిద్రం, భయం, కూలికి బత్తెం చాలని వెట్టిచాకిరి-వీటితో ఎంతమంది ప్రజల్ని మన సంఘంలో మృత్యుదేవత కడుపునపెట్టుకుంటోందో ఆలోచించారా? ఈ పరిస్థితులలో మానవత్వాన్ని గురించీ, దైవత్వాన్నిగురించీ ఆలోచించే సావకాశం వాళ్లకి వుంటుందని మనం అనుకోగలమా? వాళ్లకీ, పశువులకీ తేడా ఏమిటి? వాళ్లకి ముందర తినడానికి తిండిలేక ఛస్తోంటే నీవు స్కూళ్లు, హాస్పిటళ్లు పెట్టి డబ్బు తెచ్చుకోమంటే వాళ్లు ఎక్కడనుంచి తెచ్చుకుంటారు? దానికోసం వాళ్లు పడుతోన్న బాధలు కాక, యింకా ఎక్కువబాధ పడాలనా మీ వుద్దేశ్యం?"

"నేను మీతో వాదించదలచుకోలేదు. కాని ఒక విషయం చెప్పదలచుకొన్నాను. (పేపరు కింద పెట్టి) మనం చేతులుకట్టుకొని కూర్చొనిమాత్రం ప్రయోజనం ఏమిటి? చదువుకున్నందుకు సార్థకంగా సంఘానికి వినియోగించే పని ఏదయినా చేయాలి. అందులో మన తోడిమానవులకి తోడ్పడడంకంటె మహోత్కృష్టమయిన కార్యం యింకోటి వుందని నేననుకోను. దానికోసం మనకు ఎంతవరకు ఓపిక వుంటే

అంతవరకూ చేయవలసిందనే నా అభిప్రాయం. అది మీ కిష్టంవుండదు అని నాకు తెలుసు. కాని ప్రతీ వాళ్లకీ నచ్చేలా పనిచెయ్యడం అసాధ్యం."

"నిజమే శాంతా! నిజమే" అంది రాజ్యలక్ష్మమ్మగారు.

శాంతముందర ఆవిడకు ఒక విధమయిన భయం. తనేమన్నామాట్లాడితే అదేమయినా తెలివితక్కువగానో, అవకతవకగానో కనిపిస్తుందేమోనని ఏమీ తేలకుండా 'నిజమే శాంతా! నిజమే' అన్నమాట ఒకటే అంటూంటుంది ఆవిడ.

"ఈ వూళ్లో వున్న రైతులనందరినీ పిలిచి వాళ్లకి యీ అచ్చుకాగితాలు పంచిపెట్టినంతమాత్రంలోనూ, ఒక డాక్టరుని యీ వూరికి పిలిచినంతమాత్రంలోనూ వాళ్ల సమస్యలన్నీ తేలిపోవు. నీ గదిలో లైటు పైనున్న తోటలోకంతా కనిపించనట్లే. నీవు చేసేది వుపకారం కాదు సరిగదా వాళ్లని యింకా ఎక్కువ పనిచేయించే పరిస్థితులు ఏర్పరచడం" అన్నాను.

"అబ్బ! భగవంతుడా! ఇదేమిటి! కాని ఏదో ఒకటి చేయాలనే నే ననుకుంటానండి" అంది గట్టిగా. దానితో నేనంటే ఆమెకు పరమఅసహ్యంగా, విసుగ్గా వున్నట్లు పూర్తిగా ధ్వనించింది.

"మొదట వాళ్లు ఎడతెరిపిలేకుండా రాత్రింబవళ్లూ చచ్చే యీ పనిలో నుంచి కొంత విరామం కలిగించే పరిస్థితులు ఏర్పరచాలి. ఆ విశ్రాంతిలో వాళ్లు వాళ్లసంగతిని గురించి ఆలోచించుకొనే పరిస్థితులు ఏర్పడతాయి. అప్పుడే వాళ్లకి దేవుడూ, దయ్యం అని ఆలోచనలు పుడతాయి. లేకుండా ఎందుకొచ్చిన యీ అచ్చుకాగితాలు, ఎందుకొచ్చిన యీ గందరగోళం యిదంతానూ!" అంటున్నాను.

"ఉహూ! వాళ్లకి పని ఏమీ లేకుండా చేయాలిట! ఇది సాధ్యం అయే పనేనా?" అంది శాంత.

"ఎందుకు కాదు? నువ్వుకూడా వాళ్లతోపాటు కలిసి పనిచేయడానికి సిద్ధపడిననాడు, అంతా కలిసి పనిచేసేనాడు, రోజుకి ఎవరూ రెండు మూడు గంటలకంటె ఎక్కువ పనిచేయవలసిన అవసరం వుండదు. అప్పుడు ఎవరికీ బడలిక వుండదు. అందరి ఆరోగ్యాలూ సవ్యంగానే వుంటాయి. అందరికీ తిండి వుంటుంది. ఎవరికీ ఆకలి వుండదు. అప్పుడు హాస్పిటలు అవసరం లేదు. అంతా సావకాశంగా ఎవళ్లమాట వాళ్లు ఆలోచించుకోవచ్చు.

నే నిలా మాట్లాడుతోంటే లీల అక్కడికి వచ్చి కూర్చొని వింటోంది. శాంత వెంటనే "లీలా! నువ్వు లోపలికి పోయి చదువుకో" అంది చంటిపిల్లలని కసిరినట్లు. లోపల లీల యీవిషయాలన్నీ విని ఏమి పాడయిపోతుందో అన్న భయంతో.

శాంతకి నాతో మాట్లాడడం పూర్తిగా విసుగెత్తింది. రాజ్యలక్ష్మమ్మగారితో జమీందారు సంగతి, హాస్పిటలు వ్యవహారాలూ మాట్లాడడం ప్రారంభించింది. నేను శలవుపుచ్చుకొని యింటికేసి బయలు దేరాను.

అప్పుడే రాత్రి చాలా పొద్దుపోయింది. వాతావరణం అంతా ప్రశాంతంగా వుంది. తోట, తోట మాలీలు అంతా నిదురపోతున్నారు. నేను గేటుదగ్గరకి వచ్చేసరికి నన్ను సాగనంపడానికి లీల అప్పుడే అక్కడికి వచ్చి నిలబడివుంది.

"ఊరంతా అప్పుడే మాటుమణిగిపోయింది చూశావా!" అన్నాను నేను ఆమెముఖంలోకి చూడాలని. ఆమె నిగనిగలాడే తన చక్కని పెద్దకళ్లతో నాకేసి పూర్తిగా చూస్తోంది. "అంతా సుఖంగా నిదురపోతుంటే, చీకూ చింతా లేకుండా, మనకు అనవసరమయిన విషయాలనిగురించి మనం దెబ్బలాడుకుంటున్నాం" అన్నాను. లీల వూరుకొంది.

ఆ రాత్రి చలిగా విసుగ్గా వుంది. వెన్నెల బాగా రాలేదు. ఎక్కడో మబ్బులవెనకాల చంద్రుడు దాగుడుమూతలాడుతున్నాడు. మబ్బుసందులలోనుంచి తప్పించుకువచ్చిన వెలుతురు కిరణాలు అక్కడక్కడ రోడ్డుమీద మెరుస్తున్నాయి. దూరంలో ఆకాశం

నుంచి నక్షత్రాలు కిందకి రాలుతున్నాయి. లీల నాతో నడిచివస్తోంది నా ప్రక్కనే.

"మీరు చాలా బాగా మాట్లాడతారు. మీరు చెప్పే విషయాలు నాకు బాగా నచ్చుతాయి నిజంగా" అంది చలితో వణకుతూ.

"మరి ఏమిటి అనుకున్నావు! మనం అంతా అసలు నిజంగా మానవత్వంయొక్క అర్థాన్ని అవగాహనచేసికోడానికి ప్రయత్నించడంలోనే సాధనకి అర్థం వుంది. అది ప్రతిభాశాలికి సహజలక్షణం" అన్నాను.

మేము అప్పుడే చాలాదూరం వచ్చేశాము. లీల వెనక్కి తిరిగి చూచింది. "క్షమించండి. చాలా దూరం వచ్చేశాము. యింక పోతాను మరి" అంది. ఆ చలిలో ఆమె గజగజ వణకిపోతోంది. ఆమె చక్కని దంతపుభుజాలమీద వుల్లిపొరలాంటి జార్జెట్ కండువా, వొంటిమీద ఉండీవుండనట్లున్న లేతనీలి బ్లౌజూ మతిపోయినట్లు చూస్తూ నిలుచున్నాను ఆమె దగ్గర. "రేపు తప్పకుండా వస్తారుకదూ!" అంది. ఆమె కళ్లలో ఏవో వెలుగులు మెరిశాయి.

ఆమె వెళ్లిపోతే నే నెలాగ? నన్నేదో హఠాత్తుగా పెద్ద బ్రహ్మాండమయిన ఒంటరితనం ఆవరించినట్లు అనిపించింది. "కొంచెంసేపు ఆగవూ!" అన్నాను. ఆమెకు నేనంటే ఎంతో ప్రేమ, గౌరవం వున్నాయని నా వుద్దేశం. ఆమె ఎంత చక్కనిపిల్ల! అతి నాజూకయిన ఆమె ముఖము, ఆ అందమయినకళ్లు, నున్నని భుజాలు...... ఆమె తెలివి! చురుకుతనం! ఆమెకు చక్కని పరిజ్ఞానం వుందని నాకు గౌరవం. ఆమె నా రాణీ! నా చిత్తరువు లన్నీ ఆమెకే అంకితాలు. ఆమె లేని ప్రపంచకం నాకు అంధకారం, అమావాస్య. ఆమె వెళ్లిపోతే నే బతికేది ఎలాగ?

"నువ్వు చాలా మంచి అమ్మాయివిట! ఇంక కొంచెంసేపు ఆగుతావుకాదూ నా కోసం" అన్నాను నవ్వుతూ.

ఆమె నాకేసి చూచి విచిత్రంగా నవ్వుతుంది. ఆమెకళ్లల్లో వెలుగులు మిలమిల మెరిశాయి. "ఇంకా ఎంతసేపు చెప్పండి. చాలా చలిగావుంది!" అంది. ఆమెపెదవులు చలికి తడబడుతున్నాయి. వణకుతూ వున్న ఆమె లేతభుజాలకి నా కోటు విప్పి కప్పాను. లీల పకపక నవ్వింది. అది తీసివేయబోతోంది. వెంటనే చటుక్కున ఆమెను నాదగ్గరగా లాక్కున్నాను. ఆమె భుజాలని, ముఖాన్ని, చేతులని, ఆమె లేతపెదవులనీ ఎన్నిసార్లో ముద్దుపెట్టుకున్నాను. ఆమె నాచేతుల్లో నలిగిపోతోందేమో నని భయం. కాని ఆమెను వదలలేకపోతున్నాను.

"ఇంక ఇక రేపటిదాకా........" అంది ఆమె అతినెమ్మదిగా నన్ను విడిపించుకుంటూ. నేను యింకా దగ్గరగా తీసికొన్నాను. నా కంఠం గట్టిగా కౌగిలించుకొంది. ఆమెచేతులు తీగల్లా నా నడుముకి, మెడకి పెనవేసికొన్నాయి. "మనలో మనకి రహస్యాలేమిటి? అమ్మతో చెబితే అమ్మ చాలా సంతోషిస్తుంది. కాని శాంత...శాంత కోప్పడుతుంది" అంది.

నేను యింకొకసారి చురుకుగా ముద్దుపెట్టుకొన్నాను. నన్ను గిల్లి విడిపించుకొని పారిపోయింది. కొంతదూరం పరుగెత్తి వెనక్కి తిరిగిచూచింది. "రేపు తప్పకుండారండి" అని మళ్లా చేతితో సంజ్ఞచేసింది. మళ్లీ లేడిపిల్లలా పరుగెత్తుకొనిపోయింది. నా కింటికి వెళ్లాలని అనిపించలేదు. వెళ్లిమాత్రం ఏం చెయ్యను? ఎవరికోసం వెళ్లను? నా కాళ్లు నన్ను నెమ్మదిగా డాబాకేసి లాగుకొనిపోయాయి. డాబామీదకి పోతే జాజితీగల్లో సన్నజాజులు నన్ను చూచి నవ్వినట్లుగా ఘుమఘుమలాడేయి. నేను తిన్నగా గేటులోనుంచి లోపలికి నడిచిపోయాను. పక్కనున్న టెన్నిసుకోర్టు దగ్గర వున్న బల్లమీద పోయి కూర్చున్నాను. లీల గదిలో యింకా లైటు వెలుగుతూనేవుంది. గోడల మీద నీడలు కదులుతున్నాయి. లైటుషేడు తిప్పిన చప్పుడు. పేజీలు తిప్పుతోన్నట్లు ధ్వని. లీల ఎందుకయినా వరండామీదికి వస్తుందేమోనని అలాగే కూర్చున్నాను. ఒక గంటసేపు అయింది. దీపం ఆరిపోయింది. ఇక నీడలు కనిపించడంలేదు. చంద్రుడీసారి పైకి బాగా వచ్చాడు. తోట అంతా వెన్నెల

పందువుగా వుంది. అరవిరుస్తోన్న గులాబులు కమ్మగా వాసనవేస్తున్నాయి. చలి ఎక్కువ అవుతోంది. నాకోటు తొడుగుకొని యింటికి బయలుదేరాను.

మరునాడు మధ్యాహ్నం యథాప్రకారం 'ఉదయప్రకాశ'కి వెళ్లాను. తలుపులన్నీ తీసేవున్నాయి. మామూలు అలవాటు ప్రకారం చీడీలమీద కూర్చున్నాను. ఏ చెట్లచాటునుంచయినా, ఏ తీగెల వెనకాలనుంచయినా పుస్తకం పట్టుకొని లీల వస్తుందేమోనని చూస్తున్నాను. ఎంతసేపటికీ ఎక్కడా చడీ చప్పుడూ లేదు. లోపలికి వెళ్లాను. ప్రతిగదీ చూస్తున్నాను.

"కుక్క నీటిలో తన నీడను...నీడను... చూచెను...కుక్క... నీటిలో...తన..."అని శాంత పాఠంచెబుతోంది ఎవరికో. నా అడుగులచప్పుడు వినగానే ఆగి "ఎవరు వారు ?" అంది.

"నేను" అన్నాను.

"అలాగా! క్షమించండి! నేనిప్పుడు వెంటనే రాలేను. కొంచెం తొందరపనిలో వున్నాను" అంది.

"సరేలెండి. మీఅమ్మగారు ఎక్కడున్నారు?" అన్నాను.

"లేరు. మా అమ్మ, మా లీల మా పినతల్లిగారింటికి వెళ్లారు. అక్కడనుంచి వాళ్లు చెన్నపట్నం వెడతారు. ఇప్పుడప్పుడే తిరిగిరారు.........కుక్క నీటిలో.........తననీడను........." అని మళ్లా చెప్పడం ప్రారంభించింది.

నేను సావడిలోకి పోయి నిలుచున్నాను. నాకు ప్రపంచం అంతా కాళీఅయిపోయినట్లు అనిపించింది. ఆ తోటా, ఆ డాబా, ఆ వూరూ అన్నీ చిరాకుగా కనిపిస్తున్నాయి. నాకు వుక్కపోస్తున్నట్లుంది.

"కుక్క నీటిలో......నీటిలో... తన నీడను.........." ఇంకా వినిపిస్తానే వుంది.

నేను యింటిమొగం పెట్టి బయలుదేరాను. గేటు మళ్లే సరికి ఒక కుఱ్ఱాడు పరుగెత్తుకొని వచ్చి నా కొక చీటీ యిచ్చి పారిపోయాడు.

"నేను శాంతతో రాత్రి జరిగిందంతా చెప్పాను. దానికి చాలా కోపం వచ్చింది. వెంటనే తక్షణం నేను మీకు కనిపించకుండా వెళ్లిపోతేనేగాని వీలు లేదని పట్టుపట్టింది. నేను విధిలేక మా అమ్మతో పోవలసివచ్చింది. నేను ఎంత ఏడ్చానో మీ కోసం మీకు తెలుస్తే! నేనెప్పుడూ మీసుఖాన్నే కోరుతూ వుంటాను. నన్ను మరిచిపోకండేం!"

మళ్లీ అదేదారి మా యింటికి. అంతా కాళీ. లోకం అంతా కాళీ. నేను అంత తెలివితక్కువగా అక్కడ మాట్లాడడంవల్ల వచ్చింది యీ ముప్పు అని పశ్చాత్తాపపడ్డాను. ఇప్పుడిక ఏమి అనుకుంటే ఏం లాభం. యింటికి వెళ్లాను. మూటా ముల్లూ కట్టాను. సాయంత్రం మా వూరికి ప్రయాణం.

కొన్నాళ్లకి ఆ తోట, డాబా అన్నీ మరిచిపోతున్నాను. కాని అప్పుడప్పుడు చదువుకుంటుంటే ఏమీ కారణం లేకుండానే ఆ కిటికీ, గదిలో లైటు, గోడమీద నీడలు, నేనతినెమ్మదిగా లీలగదికేసి నడిచిన నా అడుగులచప్పుడు అంతకుముందటి సంఘటనలో నా లీలా, ఆమె నిగనిగలాడే కళ్లల్లోని వెలుగులు, ఆ అమాయికపునవ్వూ, లేతభుజాలూ, మెత్తటి తీయని పెదవులూ, అన్నీ ఒకటొకటే జ్ఞాపకం వస్తుంటాయి. బహుశా నేనూ యిలాగే జ్ఞాపకంవుంటున్నానేమో! నా కోసం లీలకూడా యిలాగే బాధపడుతోందేమో!

"లీలా! ఎక్కడున్నావ్ !"

---